క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సబ్బసాని కోటిరెడ్డిని రైతు విభాగ అధ్యక్షుడిగా, వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా తిప్పిరెడ్డి వెంకటరామిరెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షుడిగా కొక్కండ్ల బ్రహ్మం, దివ్యాంగుల విభాగ అధ్యక్షుడిగా గాలి శ్రీనివాసరావు, పబ్లిసిటీ వింగ్‌కు అన్నపరెడ్డి పుల్లారెడ్డి, ఇంటలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షులుగా జడ్డా కోటిరెడ్డి నియమితులయ్యారు.

షేక్ సలీమూన్ సంస్మరణ సభ

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని జూలకల్లు గ్రామంలో షేక్ సలీమూన్ సంస్మరణ సభను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాసంఘాలు బుధవారం నిర్వహించాయి. పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ ఆమె మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. గఫూర్ మాట్లాడుతూ, సలీమూన్ కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా ఆకలితో వచ్చిన విప్లవకారులకు అన్నం పెట్టి కడదాకా ఉద్యమ సానుభూతిపరురాలిగా నిలిచిందని అన్నారు. సభలో పీడీఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోట నాయక్, పీకేఎస్ రాష్ట్ర నాయకులు బి.కొండారెడ్డి, పౌరహక్కుల సంఘం నాయకులు వినుకొండ పేరయ్య, ప్రజాకళా మండలి రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఉన్నం రాణి, సామాజిక కార్యకర్తలు కోలా రమణారెడ్డి, భూతం అన్నపూర్ణ పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి



కారెంపూడి: పల్నాడు జిల్లాకు నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పేరు పెట్టాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. స్థానిక వీరుల గుడి ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉన్నత విలువలతో అంటరానితనం, కుల అసమానతలపై అక్షర పోరాటం చేసిన కవి కోకిల, విశ్వకవి, నవయుగ కవి చక్రవర్తిగా పేరుగాంచిన గుర్రం జాషువా పేరు పెట్టాలని కోరారు. పీడీఎం, ఎంసీపీఐ, పౌర హక్కుల సంఘం, ప్రజా నాట్యమండలి, గిరిజన సంఘాల వివిధ హోదాల నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, అబ్రహాంలింకన్, వి.కోట నాయక్, వినుకొండ పేరయ్య, షేక్ మస్తాన్‌వలి, ఉన్నం రాణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

మాచర్ల రూరల్: మండల పరిధిలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి జూనియర్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభించినట్లు కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ పోటీలలో 40 టీములు పాల్గొంటాయని చెప్పారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ జట్టుకు రూ.20 వేలు, తృతీయ స్థానానికి రూ. 15 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ జున్నా పద్మ, ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా యూరియా పంపిణీ

కారెంపూడి: స్థానిక సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారా ఒక లారీ యూరియాను బుధవారం రైతులకు పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు నాగారపు రాముడు తెలిపారు. యూరియా కొరత నేపథ్యంలో మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవతో యూరియా పంపిణీ చేయగలిగామన్నారు. 15 ఏళ్లుగా సొసైటీ ద్వారా ఎరువుల పంపిణీ లేదని మళ్లీ సొసైటీ ద్వారా ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

9న కాకాని చేపల చెరువు వేలం

నరసరావుపేట రూరల్: మండలంలోని కాకాని మైనర్ ఇరిగేషన్ చెరువులో చేపలు పెంచుకునేందుకు ఈనెల 9వ తేదీన ఉదయం 10.30 గంటలకు గ్రామంలోని సచివాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కె.మధులత బుధవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.50 వేలు ధరావత్తు చెల్లించాలని తెలిపారు. హెచ్చుపాట పాడిన పాటదారుడు మొత్తం పైకంను వెంటనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాటదారుడు 30-6-2026 వరకు చేపలను పెంచి పట్టుకునే హక్కును కలిగి ఉంటారని తెలిపారు. ఇతర సమాచారం కోసం ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బొల్లాపల్లి ఎంఈఓ-1గా చిన్నపరెడ్డి

బొల్లాపల్లి: నూతన మండల విద్యాశాఖ అధికారి-1 గా జి.చిన్నపరెడ్డి బుధవారం విధుల్లో చేరారు. వినుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న జి చిన్నపరెడ్డిని బొల్లాపల్లి ఎంఈఓ-1గా నియమిస్తూ విద్యాశాఖ ఆర్జేడి లింగేశ్వర్ రెడ్డి నుంచి ఉత్తర్వులు ఇచ్చారు.

రోడ్లు వేస్తున్నారు.. భద్రత మరుస్తున్నారు..

రెంటచింతల: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో రోడ్లు గుల్లవుతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోడ్లు నిర్మాణం చేపట్టినా నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఖరీఫ్ సీజన్ కావడంతో దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై దుమ్ములేపుతున్నాయి. స్థానిక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వలన ఎలాంటి జంకు (భయం) లేకుండా దమ్ముచక్రాలకు తొడుగులు లేకుండా ట్రాక్టర్‌లను యథేచ్ఛగా తారు రోడ్లపైనే తీసుకెళ్తున్నారు. దీంతో రోడ్లపై పదుల సంఖ్యలో దమ్ము చక్రాలతో వెళ్తుండటం కారణంగా దమ్ము చక్రాల గాడులు పడి తక్కువ సమయంలోనే ఆరోడ్లు గోతులు పడుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు.కాలాలపాటు మన్నికగా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారి(తారురోడ్డు)పై దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్లు

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్



పట్లవీడులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

వెల్దుర్తి: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండలంలోని పట్లవీడు గ్రామంలో కండ్లకుంట సొసైటీ మాజీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని గిరిజన తండాలలో మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల వారి కోసం ఆయన చేసిన కృష రువలేనిదన్నారు. మండలంలోని అన్నీ గ్రామాలలో పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కోనుగుంట శ్రీనివాసరెడ్డి, గుండెబోయిన నాగేశ్వరరావు, చౌడయ్య పాల్గొన్నారు.

పిడుగురాళ్ల రూరల్: సంక్షేమ సంతకం చేసి ప్రజల హృదయాలలో జరగని ముద్ర వేసుకున్న మహానాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో మహానేత వైఎస్సార్ వర్ధంతిని మంగళవారం రాత్రి నిర్వహించారు. మండలంలోని గుత్తికొండలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి హాజరయ్యారు.

అందరికి విద్య కార్యక్రమంపై సమావేశం



కారెంపూడి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలని కారెంపూడి ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అందరికి విద్య అందరిది బాధ్యత పేరుతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 13,008 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించినట్లు చెప్పారు. వీరిలో 800 మందిని తొలి విడత అక్షరాస్యులను చేసేందుకు ఎస్ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపు పొందించినట్లు పేర్కొన్నారు. 80 మందిని వలంటీర్లుగా ఎంపిక చేసి వారి ద్వారా చదువు చెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వయోజన విద్య సూపర్ వైజర్ కె.వెంకటేశ్వర్లు, ఏపీఎం రంగారెడ్డి పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నరసరావుపేట టౌన్: కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకొని చిలకలూరిపేటకు వెళ్తుంది. మార్గమధ్యంలోని పల్నాడు బస్టాండ్‌లో ఆగి ఉన్న కారును ఢీకొంది. సంఘటనలో కారు పాక్షికంగా దెబ్బతింది. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో చోరీ



నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు రోడ్డులోని జ్ఞానసరస్వతి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయానికి విద్యుత్ సరఫరా చేసే వైర్‌ను కత్తిరించిన దొంగలు ఆలయంలోకి ప్రవేశించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తలుపు తాలం పగులకొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి 1గంటల సమయంలో సెక్యూరిటీ సిబ్బంది దీనిని గమనించి ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన భక్తులతో పాటు నిమజ్జనం బందోబస్తులో ఉన్న పోలీసులు ఘటానా స్థలాన్ని పరిశీలించారు. చోరీపై రూరల్ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ డాక్టర్ కేజే మోహన్ రెడ్డి తెలిపారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ఏర్పాటుచేసి భద్రత కల్పించాలని కోరారు.

శ్రమజీవులకు వేతనాలు సకాలంలో చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్
- డ్వామా జిల్లా కార్యాలయం వద్ద నిరసన



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నరసరావుపేట: పని చేయించుకుని నెలలు గడుస్తున్నా ఉపాధి హామీ పథకం కింద పని చేసిన శ్రమజీవులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు పేర్కొన్నారు. పథకం శ్రమ జీవుల వేతన పంపిణీ సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని బుధవారం రామిరెడ్డిపేటలోని పీడీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రవిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం శ్రమజీవులకు రూ.35 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని తక్షణమే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీగా శ్రమ జీవులను ఇబ్బంది పెడుతుందని విమర్శించిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూలీలు పని చేసి నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కుటుంబ, వ్యవసాయ పెట్టుబడులు, పిల్లల చదువులు ఇతర అవసరాల కోసం తీసుకున్న అప్పులకు వారాలు, నెలలు వారీగా చెల్లించాల్సిన నేపథ్యంలో వేతనాలు సకాలంలో ఇస్తే శ్రమజీవులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జూన్ నుంచి ఏ ఒక్క కూలీకి నగదు చెల్లించిన దాఖలాలు లేవని, వేతనాలు సకాలంలో అందకుండా చేయడం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే కుట్రలలో భాగంగా కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే ఆందోళన చేస్తామని తమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామన్నారు. ఉపాధి కూలీలు భోజనం చేయడానికి అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి గతంలో ప్రభుత్వం గుడారాలు, టెంట్లు పంపిణీ చేసే విధానానికి కొన్నేళ్లుగా స్వస్తి పలికారని, వాటిని అందిస్తే కూలీలకు ఉపశమనం కలుగుతుందన్నారు. రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా కూలీలకు పనులు చూపించాలన్నారు. వెంటనే వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పల్నాడు జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య, నాయకులు కొమ్ముల నాగేశ్వరరావు, సాతులూరి లూథర్, బత్తుల బాలకోటయ్య, పి.ఇశ్రాయేలు, కె.బాలకోటయ్య, పి.సురేష్ పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయంలో నగదు చోరీ

- నాలుగు ఇనుప బీరువాల ధ్వంసం
- రూ.1500 ఎత్తుకుపోయిన దొంగలు




వేలుముద్రలు సేకరిస్తున్న క్యూస్ టీం పోలీసులు

శావల్యాపురం: స్థానిక సొసైటీ కార్యాలయం, ఎరువులు పురుగు మందుల దుకాణంలోకి మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఇనుప బీరువాలు పగలకొట్టి నగదు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కథనం ప్రకారం.. ఎరువుల, పురుగు మందుల దుకాణం షట్టర్ తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగలకొట్టారు. కార్యాలయంలోని ఇనుప బీరువా తలుపులను బలమైన ఆయుధంతో పగలకొట్టి రూ.1500 రూపాయల నగదును చోరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే సొసైటీ కార్యాలయంలో రెండవ అంతస్తులోకి ప్రవేశించి సందు పక్కనే ఉన్న ఇనుప గేటు తాళం పగలకొట్టి లోపలికి ప్రవేశించారు. కార్యాలయంలో ఉన్న మూడు ఇనుప బీరువాను సైతం పగలకొట్టి అందులో ఉన్న సామగ్రిని చెల్లాచెదురుగా వేశారు. అంతటితో ఆగకుండా సీసీ కెమెరాలు పగలకొట్టి సొసైటీ చైర్మన్ గదిలోకి వెళ్లి సీసీ కెమెరాకు సంబంధించిన డీవీఆర్, హార్డు డిస్క్ సైతం కూడా చోరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. సొసైటీ అధికారి కనకుర్తి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు సంఘటన స్థలాన్ని క్యూస్ టీం సీఐ ఎస్‌కె అబ్దుల్ రహిమాన్, ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, రైటరు షేక్ బాష, పోలీసు సిబ్బంది పరిశీలించి వేలుముద్రలు సేకరించారు. సొసైటీ చైర్మన్ గడుపూడి విశ్వనాథం జరిగిన చోరీ గురించి జిల్లా జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనంతరం చైర్మన్‌తో పాటు సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు కార్యాలయాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న ఈ కార్యాలయంలో చోరీ జరగటంతో మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చానీయంశంగా మారింది. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ ఐ తెలిపారు.

స్వామిత్వ సర్వేతో భూవివాదాలకు చెక్

నూజెండ్ల: మండల పరిధిలో 27 పంచాయతీల్లో స్వామిత్వ సర్వే వేగవంతంగా చేపడుతున్నట్లు డెప్యూటీ ఎంపీయో సత్యనారాయణ తెలిపారు. నూజెండ్లలో చేపడుతున్న పనులు ఆయన బుధవారం పరిశీలించారు. గ్రామాల్లో డ్రోన్, శాటిలైట్ సర్వే విధానాలను ఉపయోగించి ఆధునిక పద్ధతిలో భూమి, ఇళ్ల యజమాన్యాన్ని గుర్తిస్తున్నామన్నారు. సర్వే పూర్తి అయ్యాక గ్రామసభల ద్వారా ప్రజలకు హక్కు ప్రత్రాలు అందించటం జరుగుతుందన్నారు. ఈ విధానం ద్వారా ప్రజలకు పారదర్శకతతో కూడిన వారి ఇంటి హక్కులు పొందటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు చిట్టిబాబు, లాలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రజలను బెంబేలెత్తిస్తున్న వానరాలు!



సత్తెనపల్లి: పట్టణంలోని తారకరామ సాగర్ వాకింగ్ ట్రాక్‌పై కోతులు బెడద అధికమైంది. ఉదయాన్నే వాకింగ్‌కి వెళుతున్న వృద్ధులు, మహిళలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానరాలు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తుండటంతో నడవడానికి వచ్చిన వాకర్లు బెంబేలెత్తిపోతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా, కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి వాకింగ్ ట్రాక్‌పై కోతుల బెడద నివారించడానికి తగు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

శిథిలమైన కార్యాలయం తొలగింపు

దాచేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో శిథిలమైన మరో కార్యాలయం భవనాన్ని బుధవారం నేలమట్టం చేశారు. ఈ భవనాన్ని 1995లో మావోయిస్టులు డిటోనేటర్లు పెట్టి పేల్చివేయడంతో భవనం పూర్తిగా శిథిలమైంది. నాటి నుంచి నేటి వరకు ఈ భవనం నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న తహసీల్దార్ కార్యాలయం భవనం ఇరుకుగా ఉండటంతో కార్యాలయం సిబ్బందితోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో శిథిలమైపోయిన భవనాన్ని తొలగించి మరో భవనం నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పొక్లెయిన్‌తో నేలమట్టం చేయించారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదన పంపనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కార్యాలయం ప్రాంగణంలో ఉన్న పిచ్చి చెట్లను పొక్లెయిన్ సాయంతో పూర్తిగా తొలగించారు.



తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో శిథిలమైన భవనాన్ని నేలమట్టం చేసిన దృశ్యం

మొబైల్ బుక్ కీపింగ్ 2.0 ఎంతో మేలు

ఎంపీడీఓ శ్రీనివాసరావు

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలకు ఆర్థిక స్వావలంబనం కల్పించేందుకు మంజూరు చేస్తున్న రుణాలలో అవకతవకలు జరగకుండా మొబైల్ బుక్ కీపింగ్ 2.0 తీసుకువచ్చిందని ఇది జవాబుదారిగా పనిచేసి ఎంతో మేలు చేస్తుందని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వెలుగు మండల సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ మొబైల్ బుక్ కీపింగ్ 2.0 అమలు చేయడం ద్వారా రుణాలు చెల్లింపులో ఏలాంటి అవకతవకలు జరగకుండా జవాబుదారీతనంతో పాటు పారదర్శకత పెంపొందించవచ్చన్నారు. ఏపీఎం కృష్ణవేణి మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 1014 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని ఇప్పటి వరకు సభ్యులకు రూ.9.25 కోట్ల రుణ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వెన్ను వెంకటేష్, ఏపీఓ వెంకటేశ్వర్లు, మున్నా ప్రభురాజు, వెలుగు సీసీలు వీరకుమారి, దాసు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన వెలుగు మండల సమాఖ్య భవనం

అసెస్మెంట్ బుక్ విధానం రద్దు చేయాలి

యూటీఎఫ్ డిమాండ్

దాచేపల్లి: అసెస్మెంట్ బుక్ విధానం రద్దు చేయాలని యూటీఫ్ జిల్లా కార్యదర్శి వట్టేపు నాగేశ్వరరావు కోరారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో యూటీఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నాగేశ్వరరావు... మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పరీక్షా విధానంలో ప్రవేశపెట్టిన అస్సెస్మెంట్ బుక్ విధానం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉపయోగం లేకపోగా బోధన సమయాన్ని హరించివేస్తున్నాయని చెప్పారు. అస్సెస్మెంట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పి.రాజారావు, ప్రధాన కార్యదర్శి టి.ఆనంద్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, మోజేష్, వెంకట్రావు, రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

వీధి కుక్కల బెడద

శావల్యాపురం: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయం అయితే వీధి కుక్కల ధాటికి ప్రజలు భయానికి గురవుతున్నారు. ప్రధాన కూడలిమార్గంలో వీధికుక్కలు అధిక సంఖ్యలో సంచరించడం వలన చిన్నారులు సైతం వణికిపోతున్నారు. ముఖ్యంగా రైల్వేస్టేషను రహదారి మార్గంలో రాత్రి సమయంలో ఒంటరిగా రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికితోడు వీధిలైట్లు వెలగని సమయంలో వీధి కుక్కలు వలన బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రణ చేయాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



శావల్యాపురం సెంటరులో వీధి కుక్కలు సంచారం

పెచ్చు మీరిన మందుబాబుల ఆగడాలు

నరసరావుపేట టౌన్: పట్టణంలో మందుబాబుల ఆగడాలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నా రు. వినాయక నిమజ్జన ఊరేగింపులో విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లపై రెండు రోజుల క్రితం మందుబాబుల దాడి మరువకముందే మంగళవారం అర్ధరాత్రి శ్రీనివాసనగర్‌లో ఓ ఇంటి అద్దాలు పగుల గొట్టి నానా హంగామ సృష్టించారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు కేకలు వేస్తూ ఏ1 బార్ అండ్ రెస్టారెంట్ వెనుక ప్రాంతంలోని ఓ ఇంటి అద్దాలపై రాళ్లు విసిరి పగులగొట్టారు. ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పెద్దపెద్ద కేకలు వేసి నానా బీభత్సం సృష్టించారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ మేరకు బాధితురాలు కాకుమాను సుజాత బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బొల్లాపల్లిలో బీసీ హాస్టల్ ఏర్పాటుకు ఉత్తర్వులు

బొల్లాపల్లి: మండల కేంద్రం బొల్లాపల్లిలో బీసీ హాస్టల్ ఏర్పాటు ఉన్నట్లా.. లేనట్లా.. విద్యార్థుల్లో ప్రశ్నార్థకమైనది. స్థానికంగా బొల్లాపల్లిలో బాలురకు వసతి గృహాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ, బీసీ విద్యార్థులు అధికం. బొల్లాపల్లిలో జడ్పీ హై స్కూల్, మోడల్ స్కూల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు మండల కేంద్రానికి వస్తుంటారు. మండలంలో వెల్లటూరు, గుమ్మనంపాడు గ్రామాల్లో మాత్రమే గిరిజన బాలుర వసతి గృహాలు ఉన్నాయి. దీంతో మండల కేంద్రంలో హాస్టల్ లేక పలువురు విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. స్థానికంగా కొందరు బీసీ వసతి గృహం బొల్లాపల్లిలో ఏర్పాటు చేయాలని ప్రతినిధులు, అధికారులు చుట్టూ తిరిగిన శ్రమ ఫలించింది. పిడుగురాళ్లలో విద్యార్థులు లేక మూతపడిన వసతి గృహాన్ని బొల్లాపల్లిలో ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసింది. కొందరి ప్రయత్నం ఫలించడంతో ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే బొల్లాపల్లిలో బీసీ హాస్టల్ ఏర్పాటుకు సంబంధిత శాఖ అధికారులు శ్రీకా రం చుట్టారు. బీసీ సంక్షేమ శాఖ అధికారు లు బొల్లాపల్లిని సందర్శించి వసతి గృహం ఏర్పాటుకు బిల్డింగును పరిశీలించి, స్థానికంగా ఉన్న పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి త్వరలో హాస్టల్ ఏర్పాటు చేస్తున్న ట్లు ప్రకటించారు. అయితే విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు మూడు నెలలు కావస్తున్న నేటికీ వసతి గృహం ఊసే లేదని విద్యార్థులు అంటున్నారు. దేవుడు కరుణించినా పూజారి వరం ఇవ్వడని అన్నచందంగా అధికారుల పనితీరు ఉందని, బీసీ హాస్టల్ ఏర్పాటు చేస్తారని ఆశతో ఉన్న విద్యార్థుల్లో నిరాశ ఎదురైంది. నేటికీ బీసీ వసతి గృహం ఏర్పాటుకు సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మండల కేంద్రంలో బీసీ సంక్షేమ వసతి గృహం త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

యడ్లపాడు: ప్రపంచాన్ని చూసేందుకు కళ్లు అవసరమని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ భువనేశ్వరి చెప్పారు. యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని నేత్రదానంపై వకృత్వపోటీలు నిర్వహించారు. నేత్రదాన ప్రాముఖ్యతను వివరించారు. మొదటి బహుమతి కారుచోల సంఘవి, రెండో బహుమతి ఇంకొల్లు ఉమ, మూడో బహుమతి ఇంకొల్లు అంబిక దక్కించుకున్నారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతుల ప్రదానం నిర్వహించారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులు

శావల్యాపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) దరఖాస్తులు అన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ నేటి నుంచి ఈనెల 30 వరకు అందుబాటులో ఉంటుందని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు 8వ తరగతి చదువుతనున్న విద్యార్థులు ఈపరీక్షలు రాయటానికి అర్హులన్నారు. పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100లు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 రూపాయలు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కనెక్టు లింకు ద్వారా మాత్రమే పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. పరీక్ష రాసే సమయానికి ఆదాయ, కుల, ధ్రువీకరణ తదితర పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు పుట్టిన తేదీ, తండ్రి పేరు, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఇప్పటి వరకు 30 మంది విద్యార్థులను గుర్తించామన్నారు. గత ఏడాదిలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో 16 మంది విద్యార్థులు ఎంపిక కాగా నాలుగు సంవత్సరాల పాటు ఒక్కో ఏడాదికి రూ. 12 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం రూపంలో అర్హత కల్గియున్న విద్యార్థి బ్యాంకు ఖాతా నేరుగా ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.